క్లుప్తంగా

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



మాక్లూర్: మండలంలోని ధర్మోరా, మాందాపూర్ గ్రామాలలో బుధవారం మండల పశు వైద్యాధికారులు కిరణ్ దేశ్‌పాండే, ఉమా సహర్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఏప్రిల్ 15 నుంచి ఈ నెల 14 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాలలో 7,662 పశువులకు టీకాలు వేసినట్టు పశు వైద్యులు తెలిపారు. పశువైద్య సిబ్బంది టి.వినీత, కళ్యాణి, పుష్ప, లక్ష్మి, గంగాధర్, సుదీర్, అహ్మద్ పాషా పాల్గొన్నారు.

ధాన్యం కుప్పల పరిశీలన



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లిలో రోడ్లపై పోసిన ధాన్యం కుప్పలను బుధవారం అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) జిల్లా ప్రతినిధి బృంద సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్, దేవారంలు మాట్లాడుతూ.. లారీలు, హమాలీల కొరత, రైస్‌మిల్ యజమానులు అదనంగా తరుగు కోసం తొందరగా అన్‌లోడ్ చేసుకోకపోవడం మూలంగా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తరుగు తీసుకోకుండా, లారీలను వెంటనే ఏర్పాటు చేసి రోడ్లపై ఉన్న ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. ఆలస్యానికి కారణమైన అధికారులు, రైస్‌మిల్ యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సురేష్, బాబన్న, కిషన్, సాయిలు, ఆకుల గంగారాం, బాలయ్య, గంగాధర్, తదితరులున్నారు.

సంఘాన్ని ఐక్యంగా బలోపేతం చేద్దాం



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో మున్నూరు కాపు సంఘాన్ని ఐక్యంగా ఉండి బలోపేతం చేద్దామని జిల్లా నాయకులు కొండ దేవయ్య, బాజిరెడ్డి జగన్ అన్నారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగబోయే జనగణన కార్యక్రమంలో భాగంగా కులగణనను కూడా చేపట్టాలన్న మోదీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కులగణన కార్యక్రమంలో మున్నూరు కాపుల వివరాలు ఇచ్చే సమయంలో వారి పేరు చివర 'పటేల్' అని చేర్చి రాయాలని కోరారు. ఇందులోనే పలు రాష్ట్రస్థాయిలో మున్నూరుకాపు సంఘానికి ఎన్నికలు నిర్వహించాలన్నారు. గుజరాత్ లో మాదిరిగా పటేల్ ఉద్యమం తీసుకువచ్చి ప్రభుత్వాన్ని ఒప్పించి 'పటేల్ గెజిట్' తెప్పించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డిచ్‌పల్లి ఎంపీడీవో లింగం నాయక్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణ పనులపై ఎంపీడీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైలట్ గ్రామంగా ఎంపికైన కమలాపూర్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను కలెక్టర్ ఆమోదం కోసం పంపించినట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల పనులు త్వరగా మొదలు పెట్టించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌసింగ్ ఏఈ అన్నపూర్ణ, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

నత్త నడకన జీపీ భవన నిర్మాణం

- మూడేళ్లుగా కొనసాగుతున్న పనులు
- నిధులున్నా నిర్మాణం పూర్తి చేయడంలో అధికారుల నిర్లక్ష్యం



బొప్పాపూర్‌లో జీపీ నూతన భవనం పరిస్థితి



కొనసాగుతున్న జనరల్ ఫంక్షన్ హాల్ పనులు

రుద్రూర్: మండలంలోని బొప్పాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం నూతన భవన నిర్మాణ పనులు నత్త నడకన కొనసాగుతున్నాయి. సుమారు 28 ఏళ్ల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకున్న పాత భవనం ఇరుకుగా ఉండడం.. ఒకే గదిలో సిబ్బంది కార్యనిర్వహణ, పాలకవర్గ సమావేశాలు నిర్వహించడం ఇబ్బందిగా మారడంతో నూతన భవన నిర్మాణానికి మూడేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.16 లక్షలు మంజూరు కాగా, జూన్ 2022లో అప్పటి అసెంబ్లీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. తొలి దశలో నిర్మాణ పనులు పిల్లర్ల దశ వరకు వేగంగా కొనసాగినప్పటికి తర్వాత మందగించాయి. పిల్లర్లపై స్లాబ్ వేసి వదిలేశారు. నిధులు ఉన్నప్పటికి భవన నిర్మాణాన్ని పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. భవనం నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో కొందరు గడ్డి మోపులు నిల్వ ఉంచడానికి, పశువులు కట్టి వేయడానికి వినియోగించుకుంటున్నారు. త్వరగా నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై మండల పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ పవన్ దృష్టికి తీసుకు రాగా పని చేసిన మేరకు బిల్లులు ఇచ్చామని అన్నారు. పనులు కొనసాగించాలని పలుమార్లు కాంట్రాక్టర్‌ను కోరామని, గ్రామ సభల్లో కూడా కోరామని వివరించారు.

జనరల్ ఫంక్షన్ హాల్ పరిస్థితి అంతే..

బొప్పాపూర్‌లో రూ.50 లక్షల వ్యయంతో జనరల్ ఫంక్షన్ హాల్ పనులు కొనసాగుతున్నాయి. తొలుత ఫంక్షన్ హాల్ నిర్మాణానికి స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులు రూ.30 లక్షలను 2022లో అప్పటి స్పీకర్ హోదాలో ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మంజూరు చేశారు. పనులు కొనసాగుతున్న సమయంతో భోజనాల హాల్ కోసం ఫంక్షన్ హాల్ విస్తీర్ణాన్ని పెంచాలనే స్థానికుల విన్నపం మేరకు మరో రూ. 20 లక్షలు మంజూరు చేశారు. ఇప్పటి వరకు రూ.45 లక్షల మేర పనులు పూర్తయ్యాయి. పైన ఫంక్షన్ హాల్, కింద భోజనాల కోసం నిర్మాణం చేపడుతున్నారు. ఈ విషయమై ఏఈ పవన్‌ను వివరణ కోరగా దాదాపుగా పనులు పూర్తి కావచ్చాయని తెలిపారు. ఫంక్షన్ హాల్ విస్తీర్ణం పెంచడం వల్ల జాప్యమవుతోందన్నారు. మూడు, నాలుగు నెలల్లో పూర్తవుతుందని వివరించారు.

సీతారామ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని రామనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారామ చంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అలాగే బుధవారం శ్రీ కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం, శుక్రవారాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



సోంపూర్ శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరైన నేతలు

రుద్రూర్: ఆధ్యాత్మికత.. మానసిక ప్రశాంతతకు మార్గమని, ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పొతంగల్ మండలం సోంపూర్‌లో బుధవారం ఆయన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరయ్యారు. గ్రామంలో కొనసాగుతున్న అఖండ శివనామ సప్తాహం, నూతనంగా నిర్మించిన శివాలయంలో విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత.. క్రమశిక్షణ, నిజాయితీని అలవాటు చేస్తుందన్నారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ జెడ్పీటీసీ శంకర్ పటేల్, మాజీ ఎంపీపీలు పుప్పాల శంకర్, గంధం పవన్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ సీహెచ్ గంగాధర్, నాగరాజు గౌడ్, ఎజాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జీలుగ విత్తనాల పంపిణీ

రుద్రూర్: కోటగిరి మండలంలోని ఎత్తొండ, కొత్తపల్లి, కోటగిరి సహకార సంఘాల్లో రైతులకు గురువారం నుంచి 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్టు మండల వ్యవసాయాధికారి టి.రాజు తెలిపారు. జీలుగ విత్తనాలు 30 కిలోల బస్తా ధర రూ. 4,275 కా గా, సబ్సిడీ పోను రూ.2,138 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కోటగిరిలో వంద బస్తాలు, కొత్తపల్లిలో 30 బస్తాలు, ఎత్తొండలో 30 బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డ్ తీసుకువచ్చి విత్తనాలు తీసుకోవాలని కోరారు.

ఎడపల్లిలో..

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి సహకార సంఘంలో జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సిద్ధిరామేశ్వర్ తెలిపారు. 167 బస్తాలు అందుబాటులో ఉన్నా యని వెల్లడించారు. 2.20 ఎకరానికి ఒక బస్తా, 5 ఎకరాలకు రెండు బస్తాలు మాత్రమే ఇవ్వనున్నట్లు చెప్పారు.

వేదాంత విజ్ఞాన మహాసభలు

నందిపేట్(ఆర్మూర్): అయిలాపూర్‌లోని శ్రీరామకృష్ణ తపోవన ఆశ్రమంలో గురువారం నుంచి శనివారం వరకు వేదాంత విజ్ఞాన మహాసభలు నిర్వహించనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. సాధు సమ్మేళనం 4వ వేదాంత విజ్ఞాన మహాసభలలో భాగంగా విశ్వ కళ్యాణ మహాయాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అమరవీరులకు నివాళులు



నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్: ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా ఉగ్రవాదుల స్థావరాలపై జరిగిన దాడుల్లో వీరమరణం పొందిన అమరవీర జవాన్ల ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు కొవ్వొత్తులతో, అమరుల వీరులకు నివాళులు అర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్ కుమార్, న్యాయవాదులు పండిత్ కృష్ణ, చిలుక కిష్టయ్య, విప్లవ్ కిరణ్, నర్సయ్య, బేతు జగదీష్, వెంకట్రావు షిండే, ఐనారి అశోక్, మామిడి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల కమిటీ కార్యవర్గం ఎన్నిక



మగ్గిడి ఎత్తిపోతల కమిటీ నూతన కార్యవర్గం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి, ఖానాపూర్, అందాపూర్ గ్రామాల రాజీవ్ గాంధీ ఎత్తిపోతల కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బద్దం నాగరాజ్, వైస్ చైర్మన్‌గా తాడుశెట్టి సుమన్, కోశాధికారిగా నగ్పూర్ అశోక్, కార్యదర్శిగా నలిమెల చిన్నారెడ్డి, డైరెక్టర్లుగా భూమారెడ్డి, దినేష్, రాజేశ్వర్, రాజన్న, నర్సయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. సాగు నీటికి లోటు రాకుండా కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు ఆయా గ్రామాల రైతులు అభినందనలు తెలియజేశారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయండి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నేత శ్రీనివాస్‌రెడ్డి

మాక్లూర్: ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేసి, రైతుల ఖాతాల్లో డబ్బులు వేయించే ప్రక్రియను వేగవంతం చేయించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరారు. బుధవారం మండలంలోని గుత్ప, అడవి మామిడిపల్లి గ్రామాలలో పర్యటించి రైతులు కల్లాలపై ఆరబెట్టుకున్న ధాన్యాన్ని పరిశీలించారు. వరి ధాన్యం ఎండకు ఎండి తాలిపోతున్నాయంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఒక వైపు వర్షాకాలం ముంచుకొస్తుందన్నారు. అకాల వర్షాలు పడి కల్లాలపై ఆరబెట్టి ఉన్న ధాన్యం తడిస్తే రైతు చేతికి గింజ వరిధాన్యం దక్కదన్నారు. ఇకనైనా అధికార యంత్రాంగం స్పందించి కొనుగోలు కేంద్రాల్లో కాంటాల వేగం పెంచాలన్నారు. నాయకులు జెస్సు అనిల్, పులి యుగంధర్, అల్జాపూర్ రాజేష్, చింత ప్రవీణ్‌రెడ్డి, చిన్నాపూర్ వినోద్, డి.రమేష్ ఉన్నారు.

పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలం



రుద్రూర్‌లో బీడీ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న టీయూసీఐ నేత మల్లేష్



కోటగిరి ఎంపీడీవో చందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు

రుద్రూర్: పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలమని టీయూసీఐ రాష్ట్ర నాయకుడు, ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.మల్లేష్ అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో బుధవారం బీడీ కార్మికుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికులకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, కనీస పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు లాలయ్య, బీడీ వర్కర్స్ యూనియన్ సభ్యులు లత, యశోద, లక్ష్మి, అనిత, సవిత, జ్యోతి, మౌనిక, సావిత్రి, శంకరమ్మ పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

రుద్రూర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ కోటగిరి మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల లింగం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోటగిరి మండల అభివృద్ధి అధికారి చందర్‌కు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు సమ్మె నోటీస్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నే సాబ్, రజిని, లింగవ్వ, సాయవ్వ, లక్ష్మి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలని పిలుపు

ఆర్మూర్‌టౌన్: దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలోని మెడికల్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలన్నారు. హమాలి, భవన కార్మికుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. నల్లచట్టాలను రద్దు చేసి, వ్యవసాయ రంగాన్ని రక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు దాసు, సూర్య శివాజీ, గంగాధర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

పొంచి ఉన్న ముప్పు.. సరి చేసేదెన్నడో..?



తగ్గెల్లి నుంచి సాలూర వచ్చే రోడ్డులో వంగి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

బోధన్: సాలూర మండలంలోని తగ్గెల్లి గ్రామ అంచున ఉన్న ఓ రైస్‌మిల్లుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు సాలూర నుంచి తగ్గెల్లి వెళ్లే రోడ్డులో సాగు భూముల అంచున 3 కిలో మీటర్ల పొడువున విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. సుమారు నాలుగేళ్ల క్రితం స్తంభాలు ఏర్పాటు చేసి రైస్‌మిల్లుకు కనెక్షన్ కూడా ఇచ్చారు. ఈ విద్యుత్ స్తంభాలు పలు చోట్ల వంగిపోయి ప్రమాదకరంగా మారాయి. వంగిపోయిన విద్యుత్ స్తంభాలు రైతుల ప్రాణాలకు ముప్పు తెచ్చే పరిస్థితి ఉందని స్థానికులంటున్నారు. విద్యుత్ లైన్ ఏర్పాటులో నాణ్యత ప్రమాణాల లోపాలు ఉన్నందునే స్తంభాలు నాలుగేళ్లకే వంగిపోయాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాబోయేది వర్షాకాలం భారీ ఈదురుగాలులు, వర్షం కురిసే సమయం సమీపిస్తున్నందున విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తం కావాల్సి ఉంది. విద్యుత్ శాఖ ఏఈ కళ్యాణ్‌ను బుధవారం సాక్షి ఫోన్‌లో సంప్రదించగా స్తంభాలు వంగిపోయిన విషయం గుర్తించామని, త్వరలో సరి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శిథిలావస్థలో లక్కోర పాఠశాల



ఆగిపోయిన అదనపు గదుల నిర్మాణం



లక్కోర ఉన్నత పాఠశాల

- ఆగిపోయిన అదనపు గదుల నిర్మాణం
- భయం భయంగా తరగతుల నిర్వహణ

వేల్పూర్: లక్కోర ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరింది. దీంతో ఉపాధ్యాయులు భయంతో తరగతులు నిర్వహిస్తుండగా, విద్యార్థులు బిక్కు బిక్కు మంటూ పాఠాలు వినాల్సి వస్తోంది. దశాబ్దాల కిందట నిర్మించిన భవనం కావడం వల్ల గోడలు, స్లాబు పెచ్చులూడిపోతున్నాయి. పాత భవనం సమస్య తీర్చడానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సుమారు ఎనిమిదేళ్ల కిందట సర్వశిక్ష అభియాన్ నిధులు రూ.18 లక్షలు మంజూరు చేయించారు. వీటితో 3 అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. గదులను స్లాబు వరకు నిర్మించారు. సుమారు రూ.10 లక్షల వరకు పనులు జరుగగా, అధికారులు కేవలం రూ.7 లక్షలు మాత్రమే బిల్లు చేశారు. దీంతో తనకు బిల్లులో రూ.3 లక్షలు కోత పెట్టారని, తాను పనులు చేయలేనని కాంట్రాక్టరు చేతులెత్తేశారు. దీంతో అదనపు గదుల నిర్మాణం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అదనపు గదుల నిర్మాణం నిలిచిపోయిందని అధికారులకు, నాయకులకు విన్నవిస్తున్నాగాని సమస్యను తీర్చడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం స్కూలు పాత భవనంలో ఐదు తరగతి గదులు, ఒక ఆఫీస్ రూం, మరొకటి స్టాఫ్ రూం కింద వాడుకుంటున్నారు. సైన్స్‌ల్యాబ్, లైబ్రరీకి గదులు లేవు. ప్రస్తుతం ఉన్న భవనం పాతబడి పోవడంతో పూర్తిగా నూతన భవనం నిర్మిస్తేనే తప్ప సమస్య తీరదని పేర్కొంటున్నారు. అసంపూర్తిగా మిగిలిన 3 గదులతో పాటు మరో ఆరు గదులు అవసరమని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఎప్పుడు కూలుతుందో తెలియదు



లక్కోర హైస్కూలు భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. స్లాబు పెచ్చులు ఎప్పుడు ఊడి విద్యార్థులపై పడుతాయోనని భయంగా ఉంది. స్కూలు ముందున్న జాతీయ రహదారి–63ని విస్తరించే అవకాశం ఉన్నందున, స్కూలు కాంపౌండ్ వాల్ అందులో పోతుంది. దాంతో స్కూలుకు రక్షణ ఉండదు. ఆగిపోయిన అదనపు గదులు పూర్తి చేయించడంతో పాటు, మరో ఆరు కొత్త గదులు మంజూరు చేయాలి.

– రేణుక, లక్కోర హెచ్ఎం, ఎంఈవో వేల్పూర్

సత్తా చాటిన 'ఏకలవ్య' విద్యార్థులు

ఇందల్వాయి: సీబీఎస్ఈ గ్రాండ్ టెస్ట్ ఫలితాల్లో ఇందల్వాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యధికంగా లాకవత్ సౌందర్య 600 మార్కులు, నేనావత్ మానస 591 , కున్సోత్ ప్రణవి 576 సాధించినట్లు తెలిపారు. ఫలితాల్లో రాణించిన విద్యార్థినిలను అభినందించారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	రైడ్-2(హిందీ)-10.00, 1.00, 7.25, 10.25, రెట్రో-4.00
స్క్రీన్-2	హిట్-12.30, 3.45, 7.00, 10.15
స్క్రీన్-3	రెట్రో-11.30, 2.55, 6.20, 9.45
స్క్రీన్-4	హిట్-11.30, 2.45, 6.00, 9.15

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,000	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	89,540		

– నిజామాబాద్ బిజినెస్

విద్యార్థుల సంఖ్యను పెంచాలి



మాట్లాడుతున్న డీఈవో అశోక్

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్యను పెంచాలని జిల్లా విద్యా శాఖాధికారి(డీఈవో) అశోక్ అన్నారు. బుధవారం బోర్గాం (పి), నగరంలోని హెచ్‌పీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. బడీడు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి పాఠశాలకు వచ్చే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. జిల్లా రిసోర్స్‌పర్సన్ గద్దల రమేశ్, పాఠశాల హెచ్ఎం శంకర్, పరిశీలకుడు ప్రభాకర్, తదితరులున్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



బోధన్ రూరల్: పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో పుష్కర బ్రహ్మోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం రెండో రోజు వేద పండితులు ఆలయ అర్చకులు ఆలయంలో లక్ష్మీ వేంకటేశ్వర మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. సాయంత్రం వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య శ్రీ సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం హరికథ కార్యక్రమం చేపట్టారు. ఆలయ ప్రతినిధులు, కాలనీ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.